**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

తేదీ 06.10.2024 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. సికింద్రాబాద్ నుంచి పర్యాటక ప్రాంతం గోవాను కలుపుతూ రైల్వే శాఖ ప్రవేశపెట్టిన సికింద్రాబాద్ – వాస్కోడిగామా రైలును కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించారు.
2. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో రెసిడెన్షియల్ స్కూళ్లకు భవనాలు నిర్మించేందుకు స్థలం కేటాయిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.
3. ఢిల్లీలో రేపు మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలతో కేంద్ర హోం శాఖ ఏర్పాటు చేస్తున్న సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారు.
4. దసరా నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ళకు పౌర సరఫరాల శాఖ సన్నద్ధమవుతోంది.

……………………………………………

**సిఎం – ఢిల్లీ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రాత్రి ఢిల్లీ బయలుదేరి వెళతారు. మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలలో కేంద్ర హోం శాఖ రేపు ఢిల్లీలో నిర్వహించే సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధిష్టాన వర్గం నాయకులను కూడా కలిసి ఆయన రాష్ట్రంలో పరిస్థితులను వివరిస్తారు.

……….డెస్క్

**ఖరీప్ ధాన్యం**

ఖరీప్ ధాన్యం కొనుగోళ్ళకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ సిద్ధమవుతోంది. దసరా నుంచి జనవరి నెలాఖరు వరకు దాదాపు 4 నెలల పాటు ధాన్యం కొనుగోళ్ళు నిర్వహిస్తారు. కొనుగోళ్ళ కేంద్రాల వద్ద రైతులు తెచ్చిన ధాన్యం తడిసిపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

వర్షం వచ్చే సూచన ఉంటే రైతులకు ముందుగానే తెలియజేసి ఆ రోజు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురాకుండా జాగ్రత్తపడేలా దృష్టి పెట్టారు. అదే విధంగా రైతులు కూడా వర్షంలో తడవకుండా కొనుగోలు కేంద్రాల వద్ద తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేస్తారు. మొదటి విడతగా నల్లగొండ, మెదక్ జిల్లాల్లో కొనుగోళ్ళు ప్రారంభమవుతాయి. క్రమంగా అన్ని జిల్లాలకు విస్తరించి జనవరి నెలాఖరు నాటికి కొనుగోళ్ళ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

....డెస్క్

**ఉపాధి హామీ**

తెలంగాణలో పని చేస్తున్న 3 వేల 874 మంది ఉపాధి హామీ సిబ్బందికి వేతన స్కేలు ఇవ్వాలని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి సేవల బోర్డు పాలకమండలి రాష్ట్రాన్ని సిఫారుసు చేసింది. పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల మంత్రి సీతక్క అధ్యక్షతన జరిగిన నిన్న సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు.  ఐదేళ్ళు దాటిన కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను స్థిరకాల ఉద్యోగులుగా మార్చాలని కూడా  పాలక సమావేశం తీర్మానం చేసింది.

.........డెస్క్

**వన్ టైమ్**

హైదరాబాద్ జలమండలి మరోసారి వన్ టైమ్ సెటిల్ మెంట్ పథకాన్ని ప్రకటించింది. నీటి బిల్లులు బకాయిలు పడ్డ వినియోగదారులు ఒకేసారి చెల్లిస్తే ఆలస్య రుసుము, వడ్డీలను మాఫీ చేస్తామని తెలిపింది. ఈ పథకం ఈ నెలఖారు వరకు అందుబాటులో ఉంటుంది.

...........ప్రెస్ నోట్

**యాడ్ – నవరాత్రులు**

రాజన్న సిరిసిల్లా జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈ రోజు అమ్మవారు కూష్మాండ అలంకారంలో భక్తులకు దర్శనం ఇస్తున్నారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

...........పిటిసి

**మంచిర్యాల -ధాన్యం కొనుగోలు**

మంచిర్యాల జిల్లాలో వానా కాలానికి సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు కోసం కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు... నిబంధనల మేరకు ఆయా కేంద్రాల్లో సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లకు ఒకే చోట వేరువేరు కేంద్రాలు నిర్వహించాలని సూచించారు.

(PTC)

**పొన్నం ప్రభాకర్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తమ ప్రజా ప్రభుత్వం పాలన విజయవంతంగా కొనసాగుతోందని, గత పది నెలల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ నిర్మాణాత్మక అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు వెడుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల సమస్యలపై ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. గురుకుల స్కూళ్లలో చాలా వాటికి సొంత భవనాలు లేవన్న మంత్రి, మెస్, డైనింగ్ హాళ్లకు గ్రీన్‌ఛానెల్ ద్వారా నిధులివ్వాలని కోరినట్లు తెలిపారు. గురుకుల స్కూళ్లలో పాములు, దోమలు లేకుండా చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు.

............డెస్క్

**శరన్నవరాత్రి**

తెలుగు రాష్ట్రాలలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నేడు నాలుగో రోజున అమ్మవారిని శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా పూజిస్తున్నారు. జంటనగరాల తో సహా తెలంగాణా లోని అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. లలితాదేవి అనుగ్రహం కోరుతూ సువాసినీ పూజలు చేస్తున్నారు.

............డెస్క్

**ప్రత్యేక కమిటీ**

మూసీ నది నిర్వాసితుల జీవనోపాధి కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ చైర్మన్‌గా సెర్ప్ సీఈఓ, వైస్ చైర్మన్‌గా జీహెచ్ఎంసీ కమిషనర్‌తోపాటు మరో 12 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో వివిధ శాఖల అధికారులున్నారు. మూసీ నది నిర్వాసితుల జీవనోపాధి దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఈ కమిటీ బాధ్యత.. నిర్వాసితులను వేరే ప్రాంతాలకు తరలించిన సమయంలో వచ్చే సమస్యలను ముందుగా గుర్తించి వాటిని పరిష్కరించేందుకు తగిన సూచనలు, కార్యాచరణ నివేదికను కమిటీ 30 రోజుల్లో సమర్పించాల్సి ఉంటుంది.ఇందులో భాగంగా.. పునరావాస ప్రాంతాలకు తరలివెళ్లిన వారికి బతుకుదెరువు కోసం నైపుణ్య శిక్షణ అందిస్తారు. ............డెస్క్

**నూలు డిపో**

సిరిసిల్ల నేత కార్మికులు ఎంతకాలం గానో ఎదురు చూస్తున్న నూలు డిపో ను ప్రభుత్వం మంజూరు చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ కేంద్రంగా నూలు డిపో ను మంజూరు చేసినట్లు వ్యవసాయ, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దీని కోసం 50 కోట్ల రూపాయల నిధులను కేటాయించినట్లు ఆయన చెప్పారు. సిరిసిల్లలో 35 వేల మరమగ్గాలు ఉండగా ప్రత్యక్షంగా, పరోక్షంగా 25 వేల మంది కార్మికులు లబ్ధి పొందుతున్నారు. పవర్‌లూమ్ పరిశ్రమకు లబ్ధి చేకూరే నూలు డిపో మంజూరు చేయాలని కార్మికులు 30 ఏళ్లుగా కోరుతున్నారు. ఇప్పుడు వారి కల నేరవేరుస్తూ ప్రభుత్వం నూలు డిపోను మంజూరు చేసింది

........ పిటిసి

**బతుకమ్మ**

రాష్ట్రంలో బతుకమ్మ సంబురాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. బతుకమ్మ వేడుకల్లో నేడు అయిదో రోజున 'అట్ల బతుకమ్మ' వేడుకలు జరుపుకుంటారు. బియ్యాన్ని నానబెట్టి, దంచి

చేసిన అట్లను గౌరమ్మకు నివేదిస్తారు. ఈ రోజు చామంతి, మందార, బీర, తంగెడు, గునుగు, గుమ్మడి తదితర పూలతో అయిదు ఎత్తుల్లో బతుకమ్మను పేరుస్తారు. (PTC)

**సర్టిఫికెట్ల పరిశీలన**

రాష్ట్రంలో 11,062 టీచర్ పోస్టుల భర్తీకి సర్టిఫికెట్ల తనిఖీ ప్రక్రియ ముగిసింది. ఒక్కో ఉద్యోగానికి 1:3 నిష్పత్తిలో 25,924 మందిని వెరిఫికేషన్‌కు పిలవగా 24,466 మంది హాజరయ్యారు. మరోవైపు స్పెషల్ ఎడ్యుకేషన్ కోటాలో టీచర్ పోస్టులకు కొన్ని జిల్లాలో వెరిఫికేషన్ ప్రారంభం కాలేదు. ............డెస్క్

**తిరుమల**

తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నేడు మూడో రోజు ఉదయం సింహ వాహన సేవ నిర్వహించారు. సింహ వాహనంపై మలయప్ప స్వామిని మాడవీధుల్లో ఊరేగించారు. (DESK)

**దిగువ మానేరు**

శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నుంచి వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు వస్తున్న ప్రవాహం కారణంగా మిడ్ మానేరు నుంచి కరీంనగర్ లోని లోయర్ మానేరు డ్యాం కు సుమారు 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్టు దిగువ మానేరు జలాశయం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగభూషణం తెలిపారు. ఈ సాయంత్రం 4 గంటలకు లోయర్ మానేరు డ్యాం ప్రాజెక్టు వరద గేట్లు ఎత్తి 5 వెల క్యూసెక్కుల నీటిని మానేరు నదిలోకి వదులుతామని ఆయన తెలిపారు.

......... పిటిసి కరీంనగర్

**భట్టి**

తెలంగాణలోని పలు ప్రాంతాల్లో రెసిడెన్షియల్ స్కూళ్ళకు భవనాలు నిర్మించేందుకు స్థలం కేటాయిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఈ రోజు హైదరాబాద్ లో యంగ్

ఇండియా, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ కాంప్లెక్స్ లపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... రెసిడెన్షియల్ స్కూళ్ళ భవనాల నిర్మాణం కోసం ఆయా శాసనసభ నియోజకవర్గాల్లో 25 ఎకరాల స్థలం కేటాయిస్తామని తెలిపారు. ఇందుకుగాను 5 వేల కోట్ల రూపాయల బడ్జెట్ ను ప్రత్యేకిస్తామని చెప్పారు. ఇప్పటివరకు 20 నుంచి 25 స్కూళ్ళకు సంబంధించిన వివరాలను కలెక్టర్లు ప్రభుత్వానికి పంపారని, పైలెట్ ప్రాజెక్టు కింద వాటి పనులు వెంటనే చేపడతామని భట్టి విక్రమార్క చెప్పారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

......డెస్క్

**కిషన్ రెడ్డి – గోవా రైలు**

సికింద్రాబాద్ నుంచి పర్యాటక ప్రాంతం గోవాను కలుపుతూ రైల్వే శాఖ ప్రవేశపెట్టిన సికింద్రాబాద్ – వాస్కోడిగామా రైలును కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించారు. వారంలో 2 రోజుల పాటు ఈ రైలు అందుబాటులో ఉంటుంది. సికింద్రాబాద్ నుంచి వాస్కోడిగామా కు బుధ, శుక్ర వారాల్లో ఉదయం 10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5 గంటల 45 నిమిషాలకు వాస్కోడిగామాకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో గురు, శని వారాల్లో ఉదయం 9 గంటలకు వాస్కోడిగామ లో బయలుదేరి మర్నాడు ఉదయం 6 గంటల 20 నిమిషాలకు సికింద్రాబాద్ కు చేరుకుంటుంది. ఈ రోజు మాత్రం సికింద్రాబాద్ నుంచి 11 గంటల 45 నిమిషాలకు బయలుదేరిన ఈ రైలు రేపు ఉదయం 7 గంటల 20 నిమిషాలకు వాస్కోడిగామాకు చేరుకుంటుంది. ఈ కొత్త రైలుతో మధ్యలో దిగి మరో రైలు ఎక్కే అవసరం లేకుండా నేరుగా గోవాకు చేరుకోవచ్చని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ స్టేషన్ ఆధునీకరణ పనులను వచ్చే ఏడాది చివరినాటికి పూర్తవుతాయని చెప్పారు. తెలంగాణలో మరో 40 స్టేషన్ లను కూడా పునరభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు.

........బైట్